సాక్షి రంగారెడ్డి

మంగళవారం, 14, మార్చి, 2023



ఆక్రమణను అడ్డుకుంటారా?

తుర్కయంజాల్ పరిధిలోని మాసబ్ చెరువు నీటిలో డంప్ చేసిన మట్టిని తొలగించడంలో అధికారులు వెనకడుగు వేస్తున్నారు. 8లో▸



జాతరలు సంస్కృతికి ప్రతీక

జాతరలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. 8లో▸



ఆ నాయకత్వం అవసరం

నిస్వార్థంగా రాజకీయాలు చేస్తున్న కమ్యూనిస్టుల నాయకత్వం దేశానికి అవసరమని ప్రముఖ సినీ డాన్స్ మాస్టర్ రాకేశ్ అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అణగారిన వర్గాల రాజ్యస్థాపనకు కలసిరండి

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్



చెర్కుపల్లిలో మాట్లాడుతున్న డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్

కొందుర్గు: ఎస్సీ, ఎస్టీ, బీసీ, అణగారిన వర్గాల రాజ్యస్థాపన కోసం దళిత్ శక్తి ప్రోగ్రాం చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్రకు అందరూ కలిసి రావాలని డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ పిలుపునిచ్చారు. ఆయన చేపట్టిన పదివేల కిలోమీటర్ల పాదయాత్ర సోమవారం కొందుర్గు మండలంలోని తంగెళ్లపల్లి, చెర్కుపల్లి, మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అణగారిన వర్గాల రాజ్యం స్థాపించినప్పుడే అగ్రకులాల్లో ఉన్న పేదలకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. పేదల రాజ్యం వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీలందరికీ ఉచితంగా వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వస్తాయన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాకేష్, నాయకులు భిక్షపతి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు మహిళా లీడర్‌షిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న మాజీ సర్పంచ్ దేవి

కందుకూరు: మండల పరిధిలోని పులిమామిడికి చెందిన మాజీ సర్పంచ్ అనేగౌని దేవి మహిళా లీడర్‌షిప్ నేషనల్ అవార్డు–2023 అందుకున్నారు. బహుజన సాహిత్య అకాడమీ నేషనల్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ విష్ణువర్ధన్ తదితరులు సోమవారం తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా దేవి మాట్లాడుతూ.. తనకు అవార్డు రావడంతో బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

అల్లవాడ ఎంపీటీసీకి అవార్డు



అవార్డు అందుకుంటున్న కమ్మరి సత్యనారాయణచారి దంపతులు

చేవెళ్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఇటీవల ఎంపికైన అల్లవాడ ఎంపీటీసీ కమ్మరి సత్యనారాయణచారి తిరుపతిలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అవార్డు రావటం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

సమస్యలు పరిష్కరించండి

- టీఎస్‌డీడీసీఎఫ్ చైర్మన్‌ను కలిసిన పాడిరైతులు

కడ్తాల్: పాడిరైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పాడిరైతులు సోమవారం తెలంగాణ పాడిపరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య (టీఎస్‌డీడీసీఎఫ్) చైర్మన్ భరత్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించి, వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా పాలసేకరణ ధర పెంచాలని కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాడిరైతు సంఘం నాయకులు నర్సింహారెడ్డి, తుల్జానాయక్, కృష్ణయ్య, దశరథం, రంగనాయక్, యాదయ్య, రంగయ్య, వెంకటయ్య, జయంత్, హరియానాయక్, నర్సింహ, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ వీఎంహోం పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు



హయత్‌నగర్: పోలింగ్ స్టేషన్‌లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరీశ్



హుడాకాంప్లెక్స్: ఓటు వేసినట్లు సిరా మార్కు చూపిస్తున్న ఉపాధ్యాయురాలు

86.9% పోలింగ్

ప్రశాంతంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటు హక్కు వినియోగించుకున్న ఉపాధ్యాయులు
- సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియానికి బ్యాలెట్ బాక్సులు
- 16న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- ఓట్ల లెక్కింపుపై అభ్యర్థుల్లో ఉత్కంఠ



హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని స్ట్రాంగ్ రూమ్‌కి బ్యాలెట్ బాక్సుల తరలింపు



మీర్‌పేట: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉపాధ్యాయ శాసనమండలి నియోజకవర్గానికి సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 86.9 శాతం పోలింగ్ నమోదైంది. రాజేంద్రనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్ మండలాల్లోని పలు కేంద్రాలను కలెక్టర్ హరీశ్ సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై.. సాయంత్రం 4 గంటలకు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 గంటలకు 15.2 శాతం పోలింగ్ నమోదు కాగా, 12 గంటలకు 43.8 శాతం నమోదైంది. మధ్యాహ్నం 2 గంటల వరకు 65.5 శాతం, సాయంత్రం 4 గంటల వరకు 86.9 శాతం నమోదైనట్లు కలెక్టర్ హరీశ్ ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను సరూర్‌నగర్ ఇండోర్‌స్టేడియానికి తరలించి అక్కడే భద్రపరిచారు. ఈ నెల 16న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుందని కలెక్టర్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు. ప్రశాంతంగా ఎన్నికలు ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపుపై అభ్యర్థుల్లో ఉత్కంఠ మొదలైంది. ఏ మండలంలో.. ఎవరికి ఎక్కువ ఓట్లు పోలయ్యాయి? మొదటి ప్రాధాన్యత ఓట్లు ఎక్కువగా ఎవరికి పడ్డాయి? రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి పడ్డాయి? ఎవరు గెలువనున్నారు? ఏ మండలంలో ఏ అభ్యర్థికి ఎంత మెజార్టీ రానుంది అంటూ ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్ల నియోజకవర్గ ఎన్నిక పోలింగ్ పూర్తవడంతో ఉన్నతాధికారులు ఓట్ల కౌంటింగ్‌పై దృష్టి సారించారు. ఈ నెల 16వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కించనున్నారు. మొత్తం 9 జిల్లాల పరిధిలోని 137 పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లను లెక్కించేందుకు రెండు హాళ్లలో 28 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు పలువురు అధికారులకు ఆయా బాధ్యతలు అప్పగించారు. కౌంటింగ్ సందర్భంగా రిటర్నింగ్ అధికారికి సహకరించేందుకు వికారాబాద్, రంగారెడ్డి, జోగులాంబ గద్వాల్, నాగర్‌కర్నూల్, నారాయణపేటల అడిషనల్ కలెక్టర్లను స్పెషలాఫీసర్లుగా నియమించారు.

ఇంటర్ పరీక్షలకు రెడీ

- రేపటి నుంచి ఏప్రిల్ 4 వరకు వార్షిక పరీక్షలు
- ఉదయం 9 నుంచి 12 గంటల వరకు
- జిల్లాలో 182 పరీక్ష కేంద్రాలు
- సెంటర్ల వద్ద 144 సెక్షన్ అమలు
- హాల్‌టికెట్లకు ఫీజుతో ముడి
- ఆందోళనలో విద్యార్థులు.. తల్లిదండ్రులు



మంత్రి సబితారెడ్డితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరీశ్ తదితరులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. 71,773 మంది ఫస్టియర్, 55,883 మంది సెకండియర్ విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా వ్యాప్తంగా 182 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రశ్నాపత్రాల నిల్వ.. తరలింపు కోసం 31 స్టోరేజీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు

ప్రతి 20 మందికి ఒక ఇన్విజిలేటర్ చొప్పున ఎంపిక చేశారు. ఆ బాధ్యతను ఆయా కాలేజీల యాజమాన్యాలకే అప్పగించారు. నాలుగు సిట్టింగ్, నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే పలు కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాలు హాల్ టికెట్లకు ఫీజులను ముడిపెడుతున్నాయి. పూర్తి ఫీజు చెల్లించిన వారికే హాల్ టికెట్లు ఇస్తూ.. చెల్లించని వారికి నిరాకరిస్తున్నారు. మరో రెండు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్ బోర్డు అధికారులు మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు ఉంచినట్లు చెబుతున్నారు. స్వయంగా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావచ్చని సూచిస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లపై కాలేజీ ప్రిన్సిపాల్ సంతకం తప్పనిసరని యాజమాన్యాలు చెబుతుండగా.. కాదని అధికారులు స్పష్టం చేయడం విశేషం.

సమస్యాత్మక కేంద్రాలపై నిఘా

పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చనున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులకు తక్షణమే ప్రాథమిక వైద్యసేవలు అందించేందుకు ప్రతి సెంటర్‌కు ఒక ఏఎన్ఎం సహా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు అందుబాటులో ఉంచారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి..వాటి వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లోని రెగ్యులర్ అధ్యాపకులు ఈ డ్యూటీలకు దూరంగా ఉంటున్నారు. విధిలేని పరిస్థితుల్లో వారి స్థానాల్లో ఉస్మానియా సహా ఇతర వర్సిటీల్లో పీజీ కోర్సులు చదువుతున్న నిరుద్యోగ అభ్యర్థులను ఇన్విజిలేటర్లుగా ఎంపిక చేస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏర్పాట్లు పూర్తి చేశాం

ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ హరీశ్ చెప్పారు. ఈ మేరకు సోమవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ఇంటర్ బోర్డు అధికారులతో కలిసి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ హరీశ్ మాట్లాడారు. సెంటర్లలో విద్యార్థులకు అవసరమైన ఫర్నిచర్ సహా..ఇతర మౌలిక సదుపాయాలు సమకూర్చినట్లు తెలిపారు. పరీక్షల సమయంలో మానసికంగా కుంగిపోయే విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు కౌన్సిలర్లను నియమించినట్లు చెప్పారు. ఇందుకు 14416 కాల్ సెంటర్ ఏర్పాటుచేశామన్నారు. సీసీ కెమెరాల నిఘా కింద ప్రశ్నాపత్రాలను విప్పి.. పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షలను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కంట్రోల్ రూమ్ సహా 8978158484 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సమావేశంలో జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి వెంక్యానాయక్, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సుస్వరాల భాగ్యం

తెలుగు సినీ చరిత్ర పుటల్లో ఆర్‌ఆర్‌ఆర్ నాటు.. నాటు పాట నూతన అధ్యాయాన్ని లిఖించింది. ప్రతిష్టాత్మక ఆస్కార్ పురస్కారానికి ఎంపికై హైదరాబాద్ మహా నగరం పేరును విశ్వ వ్యాప్తం చేసింది. సిటీకి చెందిన గాయకులు పాడిన పాటకు ఆస్కార్ అవార్డు దక్కడంతో నవయువ విజయాల భాగ్య 'నగ'రి మణిహారంలో మరో ఆణిముత్యం జత చేరింది. టాలీవుడ్ రాజధానిగా.. సినిమాల తయారీకి చిరునామాగా ఉన్న నగర ఖ్యాతిని ఇనుమడింపజేస్తూ ఆస్కార్ పురస్కారం వరించడం సిటిజనులకు గర్వకారణంగా మారింది. ఆర్‌ఆర్‌ఆర్ సినిమా రూపకర్తలు, కథా నాయకులు, నృత్య దర్శకుడు... అందరూ మన సిటిజనులే కాగా నాటు నాటు పాడిన ఇద్దరు యువ గాయకులు కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ ఇక్కడే పుట్టి పెరిగిన వారు కావడంతో సంతోషం ద్విగుణీకృతమైంది.

– సాక్షి, సిటీబ్యూరో



రాహుల్ సిప్లిగంజ్

- నాటు.. నాటు పాటకు ఆస్కార్ పురస్కారం
- కాలభైరవ, రాహుల్ సిప్లిగంజ్ సిటీ కుర్రాళ్లే
- విశ్వ సినీ చరిత్రలో మన నగరానికి ఖండాంతర ఖ్యాతి
- ఇరువురు గాయకులపై అభినందనల వెల్లువ

ధూల్‌పేట్‌లో పుట్టి.. దుమ్ము లేపుతున్నాడు..

- నగరంలోని ధూల్‌పేట్‌కు చెందిన ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టి.. ఖండాంతర ఖ్యాతి సొంతం చేసుకున్నాడు రాహుల్ సిప్లిగంజ్. ఇంట్లోని గిన్నెలు, స్టీలు ప్లేట్ల మీద దరువేసిన నాటి అల్లరి కుర్రోడు ఆస్కార్ ను ఇంటికి తెచ్చేసుకున్నాడు. నిన్నా మొన్నటి దాకా మన మధ్యనే ఆడి పాడిన రాహుల్ సిప్లిగంజ్ అంతర్జాతీయ స్థాయిలో సినీ ప్రముఖుల మధ్య పాడి ఆడించాడు.
- చిన్నవయసులో గజల్ మాస్టర్ దగ్గర కొన్నాళ్లు శిష్యరికం చేసిన రాహుల్.. మరో వైపు తండ్రికి సహాయంగా బార్బర్ షాప్‌లో పని చేశాడు. ఏడేళ్ల శిక్షణలో గజల్స్‌పై పట్టు సాధించాడు. ఆ సమయంలోనే సినిమాల్లో కోరస్‌గా అలా అలా నాగ చైతన్య తొలి చిత్రం జోష్‌లో 'కాలేజీ బుల్లోడా' పాటతో అవకాశం వచ్చింది.
- ఆ తర్వాత తను పాడిన పాటల సీడీని తీసుకొని వెళ్లి మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణికి వినిపించి, ఆయన సంగీత దర్శకత్వంలో 'వాస్తు బాగుందే' అనే పాడే అవకాశం దక్కించుకున్నాడు. ఆ తర్వాత 'ఈగ'లో టైటిల్ సాంగ్, రచ్చ'లో సింగరేణి ఉంది... బొగ్గే పండింది, 'రంగస్థలం'లో రంగా రంగా రంగస్థలానా,'ఇస్మార్ట్ శంకర్'లో బోనాలు.. వంటి వరుస హిట్ సాంగ్స్‌తో స్టార్ సింగర్‌గా ఎదిగిపోయాడు. ఓ వైపు గాయకుడిగా రాణిస్తూనే మరోవైపు ప్రైవేట్ ఆల్బమ్స్ కూడా స్వయంగా రూపొందిస్తూ.. మంగమ్మ, పూర్ బాయ్, మాకీ కిరికిరి', 'గల్లీకా గణేష్', 'దావత్'.. ఇలా నగర సంస్కృతీ సంప్రదాయాలకు తనదైన గానాన్ని జతచేసి సక్సెస్ సాధించాడు. గత 2019లో బిగ్‌బాస్ సీజ న్-3లో గెలిచి మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు.

కాలభైరవ.. గాన వైభవ..

ప్రముఖ సంగీత దర్శకుడు, నాటు నాటు పాటకు స్వరాలద్దిన కీరవాణి తనయుడు కాలభైరవ.. గత కొంత కాలంగా గాయకుడిగా రాణిస్తున్నాడు. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పాడుతున్నాడు. గాయకుడిగానే కాకుండా మత్తు వదలరా, కలర్ ఫొటో సినిమాలకు సంగీత దర్శకత్వం వహించి సత్తా చాటాడు. బాహుబలి 2లో దండాలయ్యా... పాటతో సూపర్ హిట్ కొట్టాడు. నాటు నాటు పాటలో సహ గాయకుడు రాహుల్‌తో కలిసి స్వరం కలిపి ఏకంగా ఆస్కార్‌నే అందుకున్నాడు.

ఐటీ దాడుల కలకలం



వెంకటరమణ జ్యువెల్లర్స్ దుకాణం

షాద్‌నగర్: గ్రామీణ ప్రాంత నేపథ్యమున్న పరిగి, షాద్‌నగర్ పట్టణంలో ఐటీ దాడులు కలకలం రేపాయి. శ్రీవెంకటరమణ జ్యువెల్లర్స్ దుకాణాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారనే వార్త దావానలంలా వ్యాపించింది. దీంతో పన్ను ఎగవేస్తూ వ్యాపారాలు నిర్వహిస్తున్నవారు ఆందోళనకు గురయ్యారు. తమ షాపులపై ఎక్కడ దాడులు చేస్తారోనని పరస్పరం ఫోన్లు చేసి సంభాషించుకున్నారు. నగల దుకాణంలో కొనసాగుతున్న దాడుల పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆరా తీసేందుకు ప్రయత్నించారు. స్థానిక ప్రజల్లో సైతం సోమవారం ఈ విషయంపైనే హాట్‌హాట్‌గా చర్చ సాగింది. అవినీతి సొమ్ము దొరికిందా..? ఐటీ దాడుల వెనక కారణాలేంటి..? తదితర అంశాలను కనుక్కునే ప్రయత్నం చేశారు. కానీ అధికారులు అత్యంత రహస్యంగా దాడులు కొనసాగించడంతో ఏ చిన్న విషయం కూడా బయటకు రాలేదు. దీంతో మరింత ఉత్కంఠ నెలకొంది.

విద్యార్థులు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

జేఎన్టీయూ ప్రొఫెసర్, విదేశీ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ బాలునాయక్

మొయినాబాద్ రూరల్: విద్యార్థులు నాణ్యమైన విద్యను అభ్యసిస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని జేఎన్టీయూ వర్సిటీ ఆచార్యులు, విదేశీ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలోని జేబీఆర్ఈసీ ఇంజనీరింగ్ కళాశాలలో టెక్నో సంగ్రామ్ పేరుతో కల్చరల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ ఫెస్ట్‌ను బాలునాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫెస్ట్‌లతో విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీయవచ్చన్నారు. విద్యార్థుల అభివృద్ధికి టెక్నికల్, నాన్ టెక్నికల్ ఈవెంట్స్ దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటరమణారెడ్డి, అరుణ్‌మూర్తి, హెచ్‌ఓడిలు శేషగిరి, పి.వై.రమేశ్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ బాలునాయక్

కిరాణా దుకాణంలో పోలీసుల సోదాలు

మద్యం బాటిళ్లు స్వాధీనం

షాబాద్: ఓ కిరాణా షాపుపై పోలీసులు దాడి చేసి సోదాలు చేశారు. ఆదివారం రాత్రి మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో మద్యం అమ్ముతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది లక్ష్మయ్యగౌడ్ దుకాణంపై దాడి చేసి మద్యం బాటిళ్ల ను స్వాధీనం చేసుకున్నారు. లక్ష్మయ్యగౌడ్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేశామని పోలీసులు వెల్లడించారు.

ఆక్రమణను అడ్డుకుంటారా..?

- కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా చెరువులో మట్టి డంప్
- తొలగించేందుకు సహకరించని ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు
- చర్యలకు ఉపక్రమించని అధికార యంత్రాంగం

తుర్కయంజాల్: మాసబ్ చెరువు నీటిలో డంప్ చేసిన మట్టిని తొలగించడంలో అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. చెరువు ఆక్రమణదారులు కోర్టు ఉత్తర్వులను ఉల్లఘించినా స్టే ఆర్డర్‌ను ఎత్తివేయించడంలో ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో వందల కోట్ల విలువ చేసే భూములు ఉండటంతో అంతా జట్టు కట్టే చెరువును కాజేయాలనే కుట్ర పన్నుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలు సర్వే నెంబర్లలో ప్లాట్లు చేసి పెట్టినా.. మూడేళ్లుగా నీరు ఉండటంతో అంతా మిన్నకున్నారని వాదనలున్నాయి.

ప్రజాధనం వృథా

మాసబ్ చెరువులో డంప్ చేసిన మట్టిని తొలగించడానికి మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ ప్రతీరోజు జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు, మున్సిపల్ సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల నుంచి మాత్రం ప్రోత్సాహం కరువైంది. సోమవారం ఆరు టిప్పర్లు, మూడు జేసీబీలు, ఐదు ట్రాక్టర్లు చెరువు వద్ద మట్టి తొలగింపు పనులకు ఏర్పాటు చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లిపోవడంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు వేచి చూసి మున్సిపల్ సిబ్బంది వాహనాలను తిరిగి పంపించేశారు. దీంతో వాహనాలకు అద్దె చెల్లించేందుకు సుమారు రూ.50వేల ప్రజాధనం వృథా అయింది. ఈ నెల 6న 'సాక్షి' దినపత్రికలో 'మాసబ్ చెరువుపై రియల్ కన్ను' అనే కథనం ప్రచురితమైంది. నాటి నుంచి ఇప్పటికి మూడు, నాలుగు సార్లు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. దీంతో వాహనాల అద్దె భారం మున్సిపాలిటీపై పడుతోంది.

కోర్టు ఉత్తర్వులున్నా..

సర్వే నెంబర్ 205లోని తమ భూమిలోకి ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వచ్చి ఇబ్బంది కలిగించవద్దని సదరు భూ యజమానులు 2022 మేలో హైకోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం భూమి యజమానులు కూడా మట్టిని నింపకూడదు. అయినప్పటికీ యథేచ్ఛగా వందల కొద్ది టిప్పర్ల మట్టిని చెరువు నీటిలో డంప్ చేసి కోర్టు నిబంధనలను ఉల్లఘించారు. ఈ స్టే ఆర్డర్‌ను ఎత్తివేయించడానికి సంబంధిత శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

సమాధానం కరువు

ఈ విషయంపై సాక్షి ఇరిగేషన్ ఏఈఈ గంగమ్మను వివరణ కోరగా కోర్టు ఉత్తర్వులపై ఉన్నతాధికారులతో చర్చిస్తున్నామని.. త్వరలోనే డంప్ చేసిన మొత్తం మట్టిని తొలగించి చెరువును కాపాడుతామన్నారు. మట్టిని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు వాహనాలను ఏర్పాటు చేసినా మీరు ఎందుకు పట్టించుకోవడం లేదంటే ఆమె సమాధానం దాటవేశారు.



మట్టిని తొలగించడానికి ఏర్పాటు చేసిన జేసీబీ, టిప్పర్లు



చెరువు నీటిలో డంప్ చేసిన మట్టి

గుండెపోటుతో వ్యక్తి మృతి

కడ్తాల్: జాతరకు వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని మక్త మాధారం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. తలకొండపల్లి మండల పరిధిలోని దేవునిపడకల్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పందెంగుండు పోటీలను తిలకించేందుకు బేగరి రవి(40) మధ్యాహ్నం అక్కడకి వెళ్లాడు. ఒక్కసారిగా ఛాతిలో నొప్పిరావడంతో అక్కడే కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆయన్ను చికిత్స నిమిత్తం కడ్తాల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జాతరలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక

జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

శంకర్‌పల్లి: జాతర ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో నిర్వహించిన బీరప్ప జాతరలో ఆమె ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, సర్పంచ్ సంఘం జిల్లా అధ్యక్షుడు, మిర్జాగూడ సర్పంచ్ రవీందర్‌గౌడ్, ఉప సర్పంచ్ శాంతికిషన్‌సింగ్, శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కురుమ వెంకటేశ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఒగ్గు మల్లేశ్, మాజీ సర్పంచ్ సంజీవ, నాయకులు ఒగ్గు అంజయ్య, రాజుగౌడ్, శివ యాదవ్, కిషన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న అనితారెడ్డి

ఈత చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: ఈత చెట్టుపై నుంచి కింద పడిన ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తారమతిపేట గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దండు కృష్ణస్వామిగౌడ్ (55) రోజు మాదిరిగానే సోమవారం ఉదయం కల్లుగీతకు వెళ్లాడు. గ్రామ శివారులోని ఈత చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు జారి కిందపడ్డాడు. దీంతో ఆయనకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న హయత్‌నగర్ ఎక్సైజ్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి వివరాలను నమోదు చేసుకున్నారు.

దేశానికి కమ్యూనిస్టుల నాయకత్వం అవసరం

డ్యాన్స్ మాస్టర్ రాకేశ్

ఇబ్రహీంపట్నం: ప్రజల అమాయకత్వం, పేదరికం రాజకీయ నాయకులకు నైవేద్యంగా మారిందని ప్రముఖ సినీ డాన్స్ మాస్టర్ రాకేశ్ అన్నారు. ప్రజానాట్యమండలి 3వ జిల్లా మహాసభల సందర్భంగా పట్టణంలో సఫ్దర్ హష్మీ ఓపెన్ థియేటర్(వీధి నాటకోత్సవాలు) కార్యక్రమాన్ని రెండో రోజు ఆదివారం రాత్రి డప్పు కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాకేశ్ మాస్టర్ మాట్లాడుతూ.. డబ్బులకు ఓట్లు అమ్ముకుంటే భంగపాటు తప్పదని హెచ్చరించారు. స్వార్థ రాజకీయాలపై ప్రజా కళాకారులు సాంస్కృతిక ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం దళితుడిని సీఎం చేస్తానని సీఎం కేసీఆర్ మోసం చేశారని ఆరోపించారు. ఈ తరుణంలో నిస్వార్థంగా రాజకీయాలు చేస్తున్న కమ్యూనిస్టుల నాయకత్వం దేశానికి అవసరమన్నారు. కమ్యూనిస్టులు బలహీనపడితే దేశానికే ప్రమాదమన్నారు. ప్రజానాట్యమండలి ఆంధ్ర రాష్ట్ర నాయకులు జగన్ మాట్లాడుతూ.. రచయితలకు కన్నతల్లి రంగారెడ్డి జిల్లా అన్నారు. దేశ రాజకీయాలు కలుషితం అవుతున్నాయని.. వాటిని కళారూపాలుగా ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేసేందుకు కవులు, కళాకారులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీఎన్ఎం నాయకులు తులసిగారి నర్సింహ, కట్ట నర్సింహ, సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగల్ల భాస్కర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జంగిలి రాజశేఖర్‌ను, కార్యదర్శిగా గడ్డం గణేశ్‌ను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న రాకేశ్ మాస్టర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అత్తాపూర్ ఎంఎం పహాడీ ప్రాంతానికి చెందిన అమీర్(38) భార్యతో కలిసి ఉంటున్నాడు. నగరంలోని ఓ దుకాణంలో గ్లాస్ ప్లంబింగ్ పని చేస్తున్నాడు. వారం క్రితం భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. మూడు రోజులుగా అమీర్ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని, ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని స్థానికులు అత్తాపూర్ ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి పరిశీలించగా అప్పటికే అమీర్ మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు ఉస్మానియాకు తరలించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

భర్త కొట్టాడని ఆత్మహత్యాయత్నం

కుల్కచర్ల: భర్త కొట్టాడని మనస్తాపానికి గురైన మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకున్న సంఘటన కుల్కచర్లలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చుక్కమ్మకు నాలుగేళ్ల క్రితం ఊరడి రాములుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. రాములు తరచూ భార్యతో గొడవపడేవాడు. సోమవారం సైతం ఆమెతో వాగ్వాదం చేసి కొట్టాడు. తీవ్ర ఆవేదనకు గురైంది. ఈ క్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను 108లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొట్టిన బైక్

ఒకరి మృతి, మరొకరికి గాయాలు

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి ఓల్డ్ కర్నూల్ రోడ్డు రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి వద్ద బైక్ డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు వారిని ఆసుపత్రికి తరలిస్తుండగా ఓ యువకుడు మృతి చెందాడు. మరో యువకుడిని ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకుడు తన పేరు జుబేర్‌ఖాన్, తీగలకుంట ప్రాంతంలో ఉంటానని పోలీసులకు చెప్పాడు. మృతుడి వివరాలు తెలపలేదన్నారు. సంబంధీకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను సంప్రదించాలన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి

రాజేంద్రనగర్: మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేసి వారి సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రాజేంద్రనగర్ మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని పారిశుద్ధ్య, ఇతర విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో వేలాది మంది పని చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకూ పెరుగుతున్న నిత్యావసర ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సర్వీస్‌ను రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు ఎ.సాయిలు, మండల ప్రధాన కార్యదర్శి టీ.ఆనంద్, మండల కోశాధికారి ఎ.రాజు, మండల నాయకులు పెంటయ్య, మోహన్, సామేలు, శ్రీను, నరహరి, రాజేష్, ప్రేమిల, సంతోష్, సరస్వతి, లక్ష్మమ్మ, పుష్పమ్మ, ఎల్లమ్మ, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

వంతెన ఎక్కితే వడ్డనే!

పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేపై ద్విచక్ర వాహనాల ప్రవేశానికి చెక్

- హెచ్ఎండీఏతో కలిసి ట్రాఫిక్ పోలీసుల చర్యలు
- సీసీ కెమెరాలతో నిఘా

రాజేంద్రనగర్: నిబంధనలకు వ్యతిరేకంగా పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పై ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు చెక్ పెట్టేందుకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్స్‌ప్రెస్‌వే పై ద్విచక్ర వాహనదారులు ప్రయాణించకుండా ఉండేందుకు హెచ్ఎండీఏతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు.

ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. సరోజినీదేవి ఆసుపత్రి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు 11 కిలో మీటర్ల మేర నిర్మించిన పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. ద్విచక్ర వాహనాదారులు, భారీ వాహనాలకు అనుమతి లేదన్నారు. కానీ కొందరు ద్విచక్ర వాహనాదారులు ఈ వంతెనపై నుంచి ప్రయాణిస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు.

- గతంలో ఈ వంతెనపై ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందిన ఘటనలు సైతం జరిగాయన్నారు. ఈ నేపథ్యంలో పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ద్విచక్ర వాహనదారుల ప్రవేశాన్ని అరికట్టేందుకు హెచ్ఎండీఏతో పలుమార్లు సంప్రదింపులు జరిపి తగు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.
- ఎక్స్‌ప్రెస్‌వే వంతెనపై ఎక్కేందుకు, దిగేందుకు ఏర్పాటు చేసిన ర్యాంపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.
- ఈ నెల చివరి నాటికి ఈ పనులు పూర్తి అవుతాయన్నారు. సీసీ కెమెరాల ద్వారా వాహనాదారులను గుర్తించి అపరాధ రుసుం వేస్తామన్నారు.
- సీసీ కెమెరాలను పర్యవేక్షించేందుకు పోలీస్‌స్టేషన్‌లోనే తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫ్లై ఓవర్ ర్యాంపుల వద్ద సీసీ కెమెరా వాహనాన్ని గుర్తించి అపరాధ రుసుం విధించేలా చర్యలు చేపడుతున్నామన్నారు.